క్లుప్తంగా

22న స్ట్రగుల్ కమిటీ సమావేశం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

కడప కార్పొరేషన్: విద్యుత్ సంస్థలో కార్మికుల సమస్యలు, సంస్థ పరిరక్షణకు సంబంధించిన విషయాలపై చర్చించేందుకు ఈనెల 22వ తేదీన స్ట్రగుల్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో నాయకులు జయచంద్ర, నూర్‌బాషా పిలుపునిచ్చారు. సమావేశానికి సంబంధించిన కరపత్రాలను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. స్కిల్డ్, హై స్కిల్డ్ వారికి తగిన వేతనాలు చెల్లించాలన్నారు. పదేళ్ల సర్వీస్ పూర్తయిన వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు ప్రసాద్, అశోక్, శ్రీనివాసులు, గురవయ్య, భద్రయ్య, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని ఎ.ధరణిజ సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా తెలిపారు. తిరుపతి పద్మావతీ విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ టెస్ట్, జూమ్ ఇంటర్వ్యూలలో ధరణిజ ప్రతిభ కనబరిచి బెంగళూరు కంపెనీలో ఉద్యోగం సాధించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుజాత, మెంటర్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కార్మికులకు వేతనాలు చెల్లించాలి



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న అదనపు కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు కె.తిరుపాల్, ఎస్.రవి, ప్రకాష్ కోరారు. కమిషనర్ మనోజ్‌రెడ్డిని వారు గురువారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు ఇవ్వని పక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామన్నారు. కమిషనర్ స్పందించి త్వరగా కార్మికులకు వేతనాలిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ప్రకాష్, సుంకర కిరణ్‌పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ



బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ జయరాములు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరచుకోవాలని రిమ్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ రాజేంద్రప్రసాద్, రిమ్స్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జయరాములు పేర్కొన్నారు. శాంతి సేవా సొసైటీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రిమ్స్‌లో రోగులకు గురువారం బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపాదనలో కొంత పేదల కోసం ఖర్చు చేయడం ఎంతో పుణ్య కార్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మడగలం ప్రసాద్, మద్దూరిమోహన్, విజయ్‌కుమార్, మనోహర్, స్రవంతి, అమత, బాబురావు, వినోద్, శీను, తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు బదిలీ అన్యాయం



రిలే దీక్షలు చేపట్టిన న్యాయవాదులు

కడప అర్బన్: వైఎస్‌ఆర్ జిల్లా కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.145కు వ్యతిరేకంగా నిరసనలను తెలియజేస్తున్నామని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు అన్నారు. కడప నుంచి తిరుపతికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును బదిలీ చేయడంపై న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పేద, బలహీన వర్గాలకు అవసరమైన న్యాయసేవలు అందుబాటులో లేకుండా పోతాయని, అనేకమంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.

అమ్మకు దొరకని అభయం

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగానే గర్భిణిగా ఉన్న సమయంలో తల్లీ, బిడ్డ సంరక్షణ తెలుసుకునేందుకు అవసరమైన స్కానింగ్ ఉచితంగా అందించేందుకు నిధులిస్తోంది. అయితే ఇందుకోసం కడప నగరం పాత రిమ్స్‌లో ఏర్పాటుచేసిన రాధాక్రిష్ణ నగర్ పీహెచ్‌సీలో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. దీంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

- ఉచిత స్కానింగ్ సేవలు నిలుపుదల
- ఆర్‌కే నగర్ పీహెచ్‌సీలో దుస్థితి ఇదీ..



కడప పాత రిమ్స్‌లోని ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం



నిరుపయోగంగా స్కానింగ్ యంత్రం

కడప రూరల్: గర్భిణి దశలో మహిళకు ఆరోగ్య సేవలు కీలకమైనవి. తల్లీ, బిడ్డ సంరక్షణ స్కానింగ్ ద్వారా తెలుసుకుని వైద్యం అందించాల్సిన అవసరం ఉంది. కడప నగరంలో మొత్తం 13 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. కడప పాత రిమ్స్‌లో ఉన్న రాధాక్రిష్ణ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్కానింగ్ సేవలు ఇటీవల ఉన్న ఫలంగా నిలిచిపోయాయి. 2023–24 నుంచి ప్రతి గురువారం ఇక్కడ ప్రత్యేకంగా స్కానింగ్ చేసి వైద్య సేవలందిస్తున్నారు. నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆయా విభాగాలకు స్పెషలిస్ట్ వైద్యులను నియమించింది. దీంతో ప్రతి గురువారం 30 మందికి పైగా గర్భిణులకు స్కానింగ్ సేవలు ఉచితంగా లభించేవి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే స్పెషలిస్ట్ వైద్యులకు ఉద్వాసన పలికారు. దీంతో ఈ కేంద్రంలో గత జూలై నెల నుంచి స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. ఫలితంగా విలువైన స్కానింగ్ యంత్రం మూలకు చేరింది.

ఉచిత సేవలకు ఆటంకం

ఈ వైద్య కేంద్రంలో గర్భిణులకు అవసరమైన స్కానింగ్ సేవలు ఉచితంగా నిర్వహిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మూడో నెల నుంచి తొమ్మిది నెలల వరకు వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇందులో స్కానింగ్ సేవలు ఉంటాయి. 6వ నెలలో మాత్రం ట్రిఫా స్కానింగ్ కడప సర్వజన ఆసుపత్రిలో చేస్తారు. కాగా పుట్టబోయే బిడ్డ హార్ట్ బీట్, ఎముకల పటుత్వం, పేగు మెడకు చుట్టుకోవడం వంటి సమస్యలతోపాటు ప్రసవం సమయాన్ని గుర్తించడానికి వీలు కలుగుతుంది. ఏవైనా సమస్యలుంటే వైద్యులు అందుకు తగిన మందులను సూచించడానికి ఆస్కారం ఉంటుంది. స్కానింగ్ సెంటర్‌లో పొందాలంటే రూ.3వేల నుంచి రూ.4వేల వరకు అవుతుంది. అలాంటి వైద్య సేవలకు ఆటంకం కలగడం శోచనీయం.

స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి



ఈ ఏడాది జూలై నుంచి స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. పీహెచ్‌సీలో గతంలో ప్రతి గురువారం 20 మందికి పైగా గర్భిణులు వైద్యం కోసం వచ్చేవారు. అవసరమైన వారికి ఉచితంగా స్కానింగ్ సేవలు లభించేవి. ఇపుడు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

– డాక్టర్ సుమధుర, వైద్యాధికారిణి, రాధాక్రిష్ణ నగర్ పీహెచ్‌సీ, కడప

వెంటనే సేవలను పునరుద్ధరిస్తాం..



రాధాక్రిష్ణ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోస్కానింగ్ సేవలు ఎందుకు నిలిచాయో పరిశీలిస్తాం. తక్షణమే స్పెషలిస్ట్ గైనకాలజిస్ట్ పర్యవేక్షణలో స్కానింగ్ సేవలు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయమై సంబంధిత వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. త్వరలో పునరుద్ధరిస్తాం.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కడప

ఎస్సీ, ఎస్టీ చట్టం బలోపేతం చేయాలి

– వైఎస్ జగన్‌కు దళిత ఫోరం నేత వినతి

కడప సెవెన్‌రోడ్స్: ఎస్సీ ఉప కులాలకు క్రిమిలేయర్ విధానం వర్తింపజేయకుండా, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలోపేతం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళిత ఫోరం నేత బూషిపాటి కిషోర్ కుమార్ విన్నవించారు. తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ దళిత వ్యతిరేక విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటి చట్టాన్ని గత పాలకులు తీసుకువస్తే, ఇప్పుడు ఆ చట్టం స్వరూపమే మార్చివేశారన్నారు. చట్టాన్ని కాపాడుకోకపోతే దళితులకు రక్షణే ఉండదని, రాజకీయ ప్రలోబాలకు గురవకుండా చట్టం పరిరక్షణకు మద్దతునివ్వాలని కోరారు. క్రిమీలేయర్‌తో రిజర్వ్‌డ్ పోస్టులను భర్తీ చేయకుండా వదిలివేసే ప్రమాదం ఉందన్నారు. ఈ వినతికి స్పందించిన జగన్మోహన్‌రెడ్డి తప్పక దళితులకు మద్దతుగా ఉంటామని, క్రిమిలేయర్ విధానాన్ని అడ్డుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు పాల్గొన్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమస్య వివరిస్తున్న దళిత ఫోరం నేత కిషోర్‌కుమార్

మహావీర్ మ్యూజియం భవనం శిథిలం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అధికారుల నిర్లక్ష్యంతో ఘన చరిత్ర కలిగిన మహావీర్ మ్యూజియం మూలన పడిందని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ అన్నారు. మహావీర్ మ్యూజియాన్ని గురువారం డీవైఎఫ్‌ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో 1982లో నిర్మించిన మహావీర్ ప్రభుత్వ ప్రదర్శన శాల ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోక శిథిలావస్థకు చేరిందన్నారు. రేపటితరం విద్యార్థులకు చరిత్ర అనవాళ్లు తెలిసేలా మహావీర్ మ్యూజియంలో నాటి పురాతన శిలలు, నాణేలు, ఖడ్గాలు వున్నాయన్నారు. మహావీర్ మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, వర్షం కురిస్తే పైకప్పు పెచ్చులూడుతోందని తెలిపారు. కొత్త కలెక్టరేట్ కట్టే సందర్భంలో ఇక్కడ కాంపౌండ్ వాల్ రావడంలో మ్యూజియం మూలకు చేరి చెత్తా, చెదారం పేరుకుపోయిందని, తెలిపారు. మ్యూజియం సందర్శనకు విద్యార్థులను తెచ్చే విధంగా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



పెచ్చులూడిన పైకప్పు చూపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

ప్రమాదంగా మ్యాన్‌హోల్



కడప రవీంద్ర నగర్‌లోని కిరణ్ బార్ వద్ద గుజ్జా మసీదుకు పోయే దారిలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది మసీదుకు వెళ్లి వస్తుంటారు. ఏడు నెలలుగా ఈ మ్యాన్ హోల్ తెరుచుకునే ఉంది. రాత్రిళ్లు ఎవరైనా అదుపుతప్పి ఇందులో పడితే ప్రమాదం జరగక తప్పదు. అధికారులు స్పందించి మూత ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – కడప కార్పొరేషన్

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్‌ఆర్టీసీలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ ఎంప్లాంయిూస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య కోరారు. కడప ఆర్టీసీ ఈడీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో కడపజోన్ ఈడీ పైడి చంద్రశేఖర్‌తో జోనల్ కమిటీ పరిచయ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని జిల్లాలోని సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకుమార్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఈడీ చంద్రశేఖర్‌తో ఎంప్లాయిూస్ యూనియన్ నాయకులు

రైల్వే ఎన్నికల్లో విజయంతో సంబరాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సౌత్ సెంట్రల్ రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించడంతో కడప రైల్వేస్టేషన్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ మధుసూదనరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల ఫలితాల్లో యూనియన్ స్పష్టమైన ఆధిక్యం సాధించిందని, రైల్వే ఉద్యోగుల సమస్యల తరపునన నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం ఒకరి నొకరు మిఠాయిలు పంచుకున్నారు. తమ యూనియన్‌ను గెలిపించిన రైల్వే ఉద్యోగులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కుమార్, అనిల్, అనిల్‌కుమార్, తిమ్మాపురం కుమార్, ఎం.రవికుమార్, రాజేష్‌కుమార్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



టపాసులు కాలుస్తున్న యూనియన్ నాయకులు

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పరిశీలన

కడప కార్పొరేషన్: క్లాప్ వాహనాలు రోజూ మూడు ట్రిప్పులు తిరగాలని నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా వినాయక నగర్, ఉక్కాయపల్లె, పుట్లంపల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను గురువారం ఆయన పరిశీలించారు. క్లాప్ వాహనాలు, కార్మికుల హాజరు పట్టిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నిర్ణీత సమయాలకు జీటీఎస్‌కు చేరుకోవాలన్నారు. ఉక్కాయపల్లె జీటీఎస్‌ను రెండు రోజుల్లో శుభ్రం చేయాలని, వాహనాలకు మరమ్మతులు పూర్తిచేసి వాడుకలోకి తేవాలన్నారు. కంపోస్టింగ్ ప్రక్రియపై ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్‌తో చర్చించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకుండా శుభ్రం చేయాలని, జీటీఎస్ స్టేషన్ల నిర్వహణ మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ ధనలక్ష్మి, ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

15న 'చట్టం అందరికీ సమానమేనా' సభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: చట్టం అందరికీ సమానమేనా సభను ఈ నెల 15వ తేదీన కడప నగరంలోని హరిత హోటల్ నందు ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రజలందరికీ సమాన హక్కులు ఇచ్చి రాజ్యాంగం రూపొందించారని, అధికార పార్టీ అండతో దానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాలను సామాన్యులకు వివరించడానికి వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చట్టం అందరికీ సమానమేనా సభ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నలమూలల నుంచి మేధావులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు ఉద్యోగులు, హాజరుకావాలని పిలుపునిచ్చారు. సిద్ధరామయ్య, మక్బుల్ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.రవిశంకర్‌రెడ్డి

నటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన సినీ నటుడు మంచు మోహన్ బాబు, అతని అనుచరులను అరెస్టు చేయాలని తెలుగు జర్నలిస్టు ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. శ్రీకాంత్, కిశోర్ మాట్లాడుతూ మోహన్‌బాబు కుటుంబ కలహాలు వీధికెక్కిన నేపథ్యంలో కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధుల నుంచి మైకు లాక్కొని దాడికి పాల్పడడ హేయమైన చర్య అన్నారు. చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, డీఎం.ఓబులేశు, సాయి, బి.నారాయణ, కేసీ.బాదుల్లా, రాజేంద్ర, జాలా జయవర్ధన్, ప్రసాదరావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

మృత్యుంజయా.. ఇదేం జాప్యం స్వామీ!

ఆలయ నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించి ఇప్పటికి 14 ఏళ్లు గడిచినా నేటికీ ఆ నిర్మాణం పునాదుల దశలోనే నిలిచిపోయింది. మొండి గోడలతో మిగిలిపోయిన ఆలయ పునాదులను చూస్తూ వీటికి మోక్షమెప్పుడో శివయ్యా అంటూ భక్తులు ఆవేదన చెందుతున్నారు.

- నూతన భవన నిర్మాణంలో జాప్యం
- వెక్కిరిస్తున్న 14 ఏళ్ల కిందట పునాదులు



కడప నగరంలోని మృత్యుంజయకుంట శివాలయం

కడప కల్చరల్: కడప నగరంలోని మత్యుంజయేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేకమైన పేరుంది. విశాలమైన ప్రాంగణంలో గల ఈ ఆలయానికి పండగలు, ఇతర విశేష దినోత్సవాల్లోనే గాక సాధారణ సమయంలోనూ భక్తులు విశేష సంఖ్యలో వస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నాటి ఆలయ పెద్దలు విశాలమైన ఆలయాన్ని నిర్మించాలని భావించారు. భక్తులు, దాతలు కలిసి రావడంతో 2010లో ఆలయం వెనుకే నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అడుగడుగునా ఆటంకమే!

పెరుగుతున్న భక్తుల సౌకర్యార్థం విశాలమైన భవనాలతో ఆలయాన్ని నిర్మించాలని ఆలయ ప్రతినిధులు విస్తృతంగా శ్రమించారు. దాతలు ముందుకు వచ్చారు. కానీ అప్పట్లో నిధులు చాలవని కాంట్రాక్టర్ పేచీ పెట్టడంతో పనులు ఆగిపోయాయని సమాచారం. రాతి కట్టడంగా నిర్మించాలని ఆలయ పెద్దలు భావించడంతో పనులు అక్కడితో నిధుల సేకరణ ప్రారంభించారు. ఈ లోపు కొత్త కమిటీ రావడం, వారి అభీష్టం మేరకు ఆలయ నిర్మాణానికి సిద్ధం కావడానికి సమయం పట్టింది. ఇటీవల వారు నడుం బిగించి దేవాదాయశాఖకు చెల్లించిన సొమ్ము మేరకు ఆ శాఖ టెక్నికల్ విభాగానికి రూ. 38.50 లక్షల నిధుల అంచనా పంపారు. దాని నుంచి సర్వశ్రేయోనిధి (సీజీఎఫ్) కింద వచ్చే సొమ్ము చాలదని, కొత్త ప్రాతిపాదనల కోసం దాతలను సమీకరించే పనిలో మరికాస్త ఆలస్యమైంది. ఈ లోపు ప్రభుత్వం మారడంతో పనులు అక్కడితో నిలిచిపోయాయి. ఈ వ్యవహారాలు చూడటం కోసం ఆలయంలో ఓ వ్యక్తిని ప్రత్యేకంగా నియమించారు.

పరిస్థితి మళ్లీ మొదటికి..

ఆలయ పర్యవేక్షకుడిగా వచ్చిన వ్యక్తి ఎంతో ఉత్సాహంగా పనులు చేపట్టారు. కార్తిక మాసమంతా భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈలోపు అతడి ప్రత్యర్థి వర్గం సహకరించకపోవడంతో బాధపడిన ఆయన అర్ధంతరంగా పనులు చాలించి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆలయానికి చైర్మెన్ లేకపోవడం, పర్యవేక్షణ కొరవడడంతో పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ప్రత్యేకించి ఆలయ భవన నిర్మాణానికి వేసిన పునాదులు అలాగే ఉండిపోయాయి. 14 ఏళ్లు పూర్తయినా పరిస్థితి మళ్లీ మొదటికి చేరుకోవడంతో భక్తుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.

కప్పేసిన మంచు.. దుప్పటి

ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద



మంచులో నగరం





చెమ్ముమియాపేట ఫ్లై ఓవర్‌పై పొగమంచులో వాహనదారులు

ప్రకృతి అందాలు పరవశించే చలికాలంలోకి అడుగుపెట్టాం. బంగాళాఖాతం అవర్తనంతో కురుస్తున్న వర్షాలకు కడప నగరాన్ని మంచు దుప్పటి కప్పేసింది. వాతావరణంలో మార్పు ఊటీని తలపిస్తోంది. తుపాను కారణంగా అప్పుడప్పుడు వాన కురవడంతో చలి పంజా విసురుతోంది. రాత్రి వేళ, తెల్లవారు జామున తేమ శాతం తగ్గడంతో చలి తీవ్రత ఎక్కువగానే కనిపిస్తోంది.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

జర్మనీలో ఉద్యోగావకాశాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: నర్సింగ్ కోర్సు చేసిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.మనోహర్, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. నగరంలోని బుడ్డాయపల్లె శారద నర్సింగ్ కాలేజీలో జర్మనీలో ఉద్యోగావకాశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన యువతకు జర్మన్ బాషలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు. 35 సంవత్సరాలలోపు వారికి ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నామని, జర్మనీ భాషను ఏ నేర్పిస్తామని తెలిపారు. సురేష్‌కుమార్, శ్రీనివాస్, భానుప్రియ పాల్గొన్నారు.